



ఇప్పుడు మనోడే..!

● బదిలీల్లో వైసీపీ అనుకూల అధికారుల నియామకానికి యత్నాలు
● మనకు అనుకూలంగా ఉంటారంటున్న నాయకులు
● లోలోన రగిలిపోతున్న మండల, గ్రామ స్థాయి నేతలు



శృంగవరపుకోట, మే 29(ఆంధ్రజ్యోతి):
వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ప్రజాప్రతినిధులు, నాయకులు తమ అవసరాలను తీర్చుకోనేందుకు ఓ ఉప తహసీల్దార్‌ను శృంగవరపుకోట నియోజకవర్గ పరిధిలోని ఓ మండలంలో ప్రత్యేకంగా నియమించుకున్నారు. పెద్దల పనులను చక్కబెట్టడంలో దిట్టగా అతనికి జిల్లాలోనే పేరుంది. దీంతో అసైన్డ్ భూముల చట్టబద్ధత (ఫ్రీహోల్డ్)లో పూర్తిస్థాయిలో సహకరించారు. ఎప్పుడో అమ్మేసుకున్న భూములకు చెందిన రైతులను ఒప్పించాడు. ఎవరైనా అడిగితే ఇప్పటికీ తమ సాగులోనే ఉన్నాయని చెప్పేలా భూములను అమ్మేసుకున్న రైతులకు తర్ఫీదు ఇచ్చాడు. ఎకరాకు లక్ష చొప్పున రైతుల చేతిలోపెట్టి వైసీపీ నేతలతో పాటు తానూ భారీగా లబ్ధిపొందాడు. అప్పట్లో టీడీపీ, జనసేన నాయకులను చూస్తేనే ముఖం మాడ్చుకోనేవారు. కార్యాలయ ఆవరణలో వారడుగుపెట్టగానే ఏదో పని ఉన్నదన్నట్లు కుర్చిలో నుంచి లేచి వెళ్లిపోయేవారు. వారి పలకరింపును కూడా వినేవారు కాదు. దీంతో కూటమి ప్రభుత్వం నియోజకవర్గానికి దూరంగా ఇతన్ని బదిలీ చేయిస్తుందని అంతా భావించారు. ఏం జరిగిందో ఏమో కానీ అక్కడే ఉంచేశారు. ఈ బదిలీల్లోనైనా ఇక్కడ నుంచి వేరే చోటుకు పంపించేయాలని డిమాండ్ చేస్తుండడంతో పక్క మండలంపై కన్నేశాడు. ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులు వత్తాసు పలుకుతున్నారు.

జిల్లాలో పని చేస్తున్న పలువురు రెవెన్యూ అధికారులు వైసీపీ పాలనలో తెలుగుదేశం, జన సేనకు చెందిన చిన్న, పెద్ద నాయకులు అనే తేడా లేకుండా ముఖం చూసేందుకు కూడా ఇష్టపడేవారు కాదు. ఇక సామాన్య నాయకుడు, కార్యకర్తల వైపు కనీసం చూసేవారు కాదు. నిబంధనల ప్రకారం చేయాల్సిన పనులు కూడా జరిగేవికావు.. ఇలాంటి అధికారులను అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు ఇప్పుడు మనోడే అంటున్నారు. వీరినే సమర్థిస్తున్నారు. ఇప్పుడు మనమేమి చెబితే అది చేస్తారు... పని చేయించుకోండంటూ సాధారణ నాయకులు, కార్యకర్తలకు సర్దిచెబుతున్నారు. వీరి మాటలకు తిరిగి జవాబు చెప్పే ధైర్యం చాలక కార్యకర్తలు లోలోన రగిలిపోతున్నారు. అప్పట్లో బరితెగించి వ్యవహరించిన అధికారులను కొనసాగించడం, తిరిగి వారికే కీలక మండలాలను అప్పగించాలని చూస్తుండడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఏ ప్రభుత్వమైనా అధికారులు వారే ఉంటారని.. అప్పటికప్పుడు కొత్తగా పుట్టుకురాకపోయినప్పటికీ వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన (మిగతా 8వ పేజీలో..)

ఇంత కర్కశమా?

ఎటువైపు పోతున్నాము? విలువలు ఏమై పోతున్నాయి? ఇంత కర్కశమా? దుర్మార్గమా? మూగజీవాలని కూడా దయలేదా? ఒకదాని మీద మరొకటి కాదు.. రెండింటిని, మూడింటిని కుక్కేశారు. కొన్ని రెండు కాళ్లపై నిల్చుంటే.. మరికొన్ని కిందపడి పోయాయి. గురువారం దత్తిరాజేరు పోలీసులు పట్టుకున్న రెండు పశువుల వ్యాన్లను చూస్తే మనసు చలించి పోతుంది. రెండు చిన్నపాటి వాహనాల్లో 19 ఆవులు ఒకదానిమీద ఒకటి కనిపించాయి. ఇంత నిర్దయగా తరలిస్తున్న వారు మనుషులేనా అన్న అనుమానం కలుగుతుంది. పార్వతీపురం నుంచి పెదమానాపురం వైపు వీటిని తరలిస్తుండగా పట్టుకున్నట్లు బూర్జవలస ఎస్ఐ జి.రాజేష్ తెలిపారు. ఇద్దరు డ్రైవర్లను అరెస్టు చేసి ఆవులను గో సంరక్షణశాలకు తరలించినట్లు చెప్పారు.
- దత్తిరాజేరు, మే 29(ఆంధ్రజ్యోతి)

డీసీసీబీ ఛైర్మన్‌గా నాగార్జున

● అధికారిక ఉత్తర్వులు జారీ



విజయనగరం/రూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ)ఛైర్మన్‌గా కిమిడి నాగార్జునను నియమిస్తు గురువారం రాత్రి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని అన్ని డీసీసీబీలకు ఈ మేరకు ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఒకటి రెండు రోజుల్లో ఛైర్మన్‌గా కిమిడి నాగార్జున బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా డీసీఎంఎస్ ఛైర్మన్, డీసీసీబీ డైరక్టర్లు, పీఏసీఎస్‌లకు సంబంధించిన కమిటీల నియామాక ఉత్తర్వులు ఇంకా విడుదల కావాల్సి ఉంది. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ డీసీసీబీ బలోపేతానికి కృషి చేస్తానని ‘ఆంధ్రజ్యోతి’కి చెప్పారు.

బాలలు కార్మికులు కాకూడదు

● వారితో పనిచేయించే యజమానులపై కేసులు పెట్టాలి: కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్, మే 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాలలు పనుల్లో చేరకుండా చూడాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. వచ్చే నెల 2 నుంచి 30 వరకూ రాష్ట్ర వ్యాప్తంగా బాల కార్మికుల పునరావాసం కోసం ప్రత్యేక డ్రైవ్ చేస్తున్నట్లు తెలిపారు. తన చాంబర్‌లో జిల్లా టాస్క్ ఫోర్సు కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదకరమైన సంస్థల్లో పని చేస్తున్న బాలకార్మికులను రెండు రోజుల్లో గుర్తించాలన్నారు. ఎక్కడైనా బాల కార్మికులను గుర్తిస్తే వెంటనే పని చేయించే యజమానిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నారు. నెల రోజులు పాటు జిల్లా అంతటా టాస్క్‌ఫోర్సు కమిటీలు ఒకే సమయంలో దాడులు జరపాలన్నారు. సమావేశంలో డీఆర్‌వో మురళి, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ప్రసాద్‌రావు, ఐసీడీఎస్ పీడీ రుక్సానా బేగం తదితరులు ఉన్నారు.

● జిల్లాలో ఉద్యానశాఖ ద్వారా క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం అమలు చేయనున్నామని కలెక్టరు అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రధాన పంటలైన మామిడి, కొబ్బరి, అరటి, కోకో పంటలలో అధిక దిగుబడి సాధించే దిశగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన సంస్థలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు.

కౌలు కార్డులున్న వారికి సుఖీభవ

● వ్యవసాయ శాఖ జేడీ రామారావు

8 లో

మొక్కబడి

● జగనన్న పచ్చతోరణాల పేరిట నాడు దోపిడీ పర్వం
● వైసీపీ హయాంలో అవినీతిమయమైన పథకం
● ఏడాది అవుతున్నా నిగ్గుతేల్చని వైనం ● సరిదిద్దేది ఎప్పుడో?

ఐదేళ్ల వైసీపీ హయాంలో ఉపాధి హామీ పూర్తిగా అవినీతిమయమైంది. ముఖ్యంగా ‘జగనన్న పచ్చతోరణం’లో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఈ పథకం కింద రహదారులకు ఇరువైపులా ఉపాధి నిధులతో మొక్కలు నాటారు. సంరక్షణకు సైతం కోట్లాది రూపాయలు ఖర్చు చేశారు. ఆ ఐదేళ్లలో నాటిన చోట నేడు మొక్కలే కనిపించడం లేదు. పెద్ద మొత్తంలో నిధులు మాత్రం డ్రా చేశారు. అవన్నీ అక్రమార్కుల జేబుల్లోకి వెళ్లిపోయినట్టు ఆరోపణలున్నాయి.

రాజాం: రోడ్డు పక్కన కనిపించని మొక్కలు



రాజాం, మే 29(ఆంధ్రజ్యోతి):
జిల్లాలో ఉపాధి హామీ పథకం పనితీరు ఇంకా మెరుగుపడడం లేదు. వైసీపీ వాసనలు పోలేదు. ఇప్పటికీ శాఖలో అదే నిర్లక్ష్యం కొనసాగుతోంది. ఇటు కూటమి ప్రభుత్వం సైతం ఆ శాఖ అధికారులపై ఉదాసీనంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు ఉన్నాయి. దీంతో వారు ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్టు పరిస్థితి తయారైంది. ఇటీవల కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ పనుల విషయంలో వేతనదారులందరికీ గిట్టుబాటయ్యేలా చూడాలని ఆదేశాలిచ్చింది. కానీ ఒకే గ్రామంలో వేతనదారులందరికీ ఒకే రీతిలో వేతనాలు పడడం లేదు. ఒక్కో మేట్ వద్ద పనిచేస్తున్న వారికి ఒక్కో విధంగా వేతనాలు జమ అవుతుండడంతో వివాదాలు ఏర్పడుతున్నాయి.

రోడ్డుకిరువైపులా మొక్కలు..

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక జగనన్న పచ్చతోరణం పథకం ప్రారంభించింది. పథకం కింద (మిగతా 8వ పేజీలో..)

నదిని దోచేస్తున్నారు!





చంపావతి నదీ గర్భంలో ఎక్సకవేటర్లతో ఇసుకనును లోతుగా తవ్వేస్తున్న దృశ్యం, (ఇన్‌సెట్‌లో) దారి లేక ప్రమాదకర స్థితిలో ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్

● చంపావతిలో భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు
● ఇప్పటికే పెద్దపెద్ద గోతులు ● 20పైగా ట్రాక్టర్లతో తరలింపు

భోగాపురం, మే29(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వనరులను ధ్వంసం చేస్తున్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం అక్రమ ధనార్జనే ధ్యేయంగా దోచుకుంటున్నారు. నామరూపాల్లేకుండా చేస్తున్నారు. కాపాడాల్సిన అధికారులు అటువైపుగా కన్నెత్తి చూడడంలేదు. తమ బాధ్యత కాదన్నట్టు వ్యవహరిస్తున్నారు. భోగాపురం మండలం కోటభోగాపురం వద్ద చంపావతి నదీ ప్రాంతంలో తాజాగా ‘ఆంధ్రజ్యోతి’ కెమెరా కంట పడిన దృశ్యాలు ప్రకృతిలో జరుగుతున్న విధ్వంసాన్ని చూపాయి. ఆ ప్రాంతాన్ని గమనిస్తే నదీ గర్భాన్ని ఇసుకాసురులు ఏ స్థాయిలో తోడేస్తున్నారో అర్థమవుతోంది. నిరంతరం ఎక్సకవేటర్లతో తవ్వకాలు కొనసాగిస్తూ నది నామరూపాల్లేకుండా చేస్తున్నారు. యంత్రాలతో లోతుగా తవ్వి ట్రాక్టర్లకు నింపి తరలించుకుపోతున్నారు. సుమారు 20 ట్రాక్టర్లకు పైగా నిత్యం నదీగర్భాన్ని ఖాళీ చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చూడకపోవడం గమనార్హం. ఇసుక తరలించేందుకు దారి లేకపోయినా ప్రమాదకరంగా ట్రాక్టర్లను నడుపుతూ ఇసుకను పట్టుకుపోతున్నారు. ఈ దందా వల్ల నది ప్రమాదకరంగా మారుతోంది. పెద్ద పెద్ద గోతులతో నిండిపోతోంది. అందం.. ఆహ్లాదకరంగా మొన్నటివరకు కనిపించిన నది నేడు (మిగతా 8వ పేజీలో..)

మహానాడు విజయవంతం

● రెట్టించిన ఉత్సాహంతో తెలుగు తమ్ముళ్లు

విజయనగరం, మే 29 (ఆంధ్రజ్యోతి): పౌరుషాల పురిటిగడ్డ కడపలో ఈ నెల 27 నుంచి మూడు రోజుల పాటు చేపట్టిన మహానాడు విజయవంతం అయ్యింది. మహానాడుకు విజయనగరం జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు రెండు వేల మందికి పైగా హాజరయ్యారు. వారంతా హుషారుగా తిరుగుముఖం పట్టారు. అనేక మంది కార్యకర్తలు, నాయకులతో అధినేత చంద్రబాబు మమేకమయ్యారు. శ్రేణులంతా ఆ తీపి గురుతులతో జిల్లాకు తిరిగి పయనమయ్యారు.



మూడో రోజు మహానాడు వేదికపై అశోక్‌ను పలకరిస్తున్న చంద్రబాబు

మంగళపాలెంలో భారీ చోరీ

● మూడు కేజీల బంగారం, రూ.10 లక్షల నగదు మాయం
● ఫిర్యాదు చేసిన బాధితుడు జగదీష్‌బాబు



జగదీష్‌బాబు నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసు అధికారులు

కొత్తవలస, మే 29 (ఆంధ్రజ్యోతి) : మంగళపాలెం గ్రామంలోని గురుదేవ చారిటబుల్‌ట్రస్టు ఛైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం రాత్రి చోరీ జరగ్గా బుధవారం రాత్రి బాధితుడు జగదీష్‌బాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం రాత్రి 11 గంటలకు సీఐ షణ్ముఖరావు కేసు నమోదు చేశారు. దీంతో గురువారం ఉదయానికి ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. చోరీలో సుమారు 90 తులాల బంగారు అభరణాలతో పాటు రూ.5 లక్షల నగదును దొంగలు పట్టుకుపోయారు. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

మంగళపాలెం గ్రామంలోని గురుదేవ చారిటబుల్‌ట్రస్టు ఛైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు ఇంట్లో మంగళవారం రాత్రి దొంగలు పడ్డారు. అర్ధరాత్రి వేళ ఈ ఘటన జరిగి ఉండొచ్చునని అంచనా వేస్తున్నారు. దొంగలు ఇంటి వెనుక నుంచి లోపలికి ప్రవేశించారు. ఇంట్లో (మిగతా 8వ పేజీలో..)

దోపిడీ దొంగల అరెస్టు

● ఎనిమిది మందిని పట్టుకున్న పోలీసులు
● మరో ఇద్దరు పరారీ
● వివరాలు వెల్లడించిన చీపురుపల్లి డీఎస్పీ



వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ రాఘవులు

చీపురుపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): కష్టపడకుండా సులువుగా డబ్బులు సంపాదించాలన్న ఆశ వారిని దొంగలుగా మార్చేసింది. రియల్ ఎస్టేట్ వంటి రంగాల్లో రాణించకపోవడంతో అడ్డ దారిన కోటీశ్వరులైపోవాలని వేసిన పథకం వికటించడంతో కటాకటాల పాలయ్యారు. చీపురుపల్లి మెయిన్ రోడ్డులో ఈ నెల 23న అర్ధరాత్రి జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. స్థానికులు ఇచ్చిన సహకారంతోనే దొంగతనం జరిగినట్టు నిర్ధారించుకున్న పోలీసులు ఆ దిశగా దర్యాప్తు జరిపి దొంగల్ని పట్టుకున్నారు. డీఎస్పీ ఎస్.రాఘవులు చీపురుపల్లి పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను తెలిపారు.

చీపురుపల్లి మండలం గచ్చలవలస గ్రామానికి చెందిన మన్నేల సూర్యారావుకు చీపురుపల్లి పట్టణంలో ధనికుల వివరాలపై అవగహన ఉంది. అతను పట్టణంలోని వైశ్యరాజు సురేష్‌పై దృష్టి పెట్టాడు. డబ్బు, బంగారం భారీ ఉంటుందని పార్వతీపురం మన్యం (మిగతా 8వ పేజీలో..)

గట్టు విస్తరిస్తే మేలు

● రాజాం-డోలపేట మధ్య తగ్గనున్న రద్దీ
● తక్కువ ఖర్చు.. ఎక్కువ ప్రయోజనం

7

ఈవీఎం గోదాం పరిశీలన

● భద్రతపై ఆరా తీసిన కలెక్టర్ అంబేడ్కర్
● అప్రమత్తంగా ఉండాలని సూచన

‘నారాయణపురానికి’ జలకళ

6 లో







సభలో అమ్మాయిల ఉత్సాహం


మహానాడు వేదిక


సభకు వచ్చిన వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు



మహా జాతర



కడపలో మూడురోజుల పాటు నిర్వహించిన టీడీపీ మహానాడు జనజాతరను తలపించింది. మొదటి రెండు రోజులు వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో సందడిగా మారితే.. చివరి రోజు బహిరంగ సభ నభూతో నభవిష్యత్ అన్న విధంగా జరిగింది. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు విశేషంగా తరలిరావడంతో ఇసుక వేసినా రాలదన్నట్లుగా జరిగింది. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో మహానాడు ప్రాంగణం కిటకిటలాడింది. పెద్ద పెద్ద కటౌట్‌లు, బిగ్‌స్ర్కీన్‌లు ఏర్పాటు చేశారు. అభిమాన నాయకులు వేదికపైకి రాగానే ఉత్సాహంతో కేకలు వేశారు. సెల్‌ఫోన్లలో రికార్డు చేశారు. మహిళలు, అమ్మాయిలు ఉత్సాహంగా పాల్గొని టీడీపీకి జైకొట్టారు. వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ బహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప జిల్లాపై వరాల జల్లు కురిపించారు. సభ సక్సెస్ కావడంతో జిల్లా నాయకులను సీఎం ప్రత్యేకంగా అభినందించారు.

- కడప ఆంధ్రజ్యోతి బృందం





మహానందమాయే

కడపలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమంలో మూడో రోజు గురువారం ఉమ్మడి జిల్లాకు చెందిన నేతలు, కార్యకర్తలు సందడి చేశారు. పార్టీ అధినేత చంద్రబాబును, మంత్రి లోకేష్‌ను అభినందించారు. వివిధ అంశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం


చీపురుపల్లి: సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే కళావెంకటరావు


విజయనగరం: మహానాడు వేదిక వద్ద మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజుతో ఎమ్మెల్యే అదితి, నాయకులు


విజయనగరం: మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు


కురుపాం: కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడితో ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్


ఎస్.కోట: ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి


పార్వతీపురం: మంత్రి సంధ్యారాణితో సాలూరు నియోజకవర్గ నాయకులు


కురుపాం: మహానాడు వేదిక వద్ద కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు


ప్రధాన కుడి కాలువలో నీరు ఇలా...

'నారాయణపురానికి' జలకళ

సంతకవిటి, మే 29(ఆంధ్రజ్యోతి): రంగారాయిపురం వద్ద నాగావళిపై నారాయణపురం ఆనకట్ట జలకళను సంతరించుకుంది. వర్షాలు కురవడంతో నదిలోకి వరదనీరు చేరుతోంది. ఎగువ రిజర్వాయర్ల నుంచి నీటిని విడిచి పెడుతుండటంతో ఆనకట్టలో నీటిమట్టం పెరుగుతోంది. వైసీపీ హయాంలో ఇక్కడి ఆనకట్ట ఆధునికీకరణ పనులు చేపట్టడంతో విఫలమైంది. ప్రస్తుతం పనులు చురుగ్గా సాగుతున్నాయి వర్షాల ప్రభావంతో పనులకు ఆటంకం కలుగుతోంది. హెడ్ రెగ్యులేటర్ తలుపులు తొలగించారు. వాటి స్థానంలో కొత్తవి అమర్చాల్సి ఉంది. నదిలో నీటి ప్రవాహం పెరగడంతో పనులను నిలిపేశారు. దీంతో కుడి ప్రధాన కాలువలోకి అవసరం లేకున్నా నీటిని విడిచి పెడుతున్నారు.

ఈ పుష్పాల అందమే అందం!



శృంగవరపుకోట, మే 29(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పట్టణంలోని ఓ ఇంటి ఆవరణలో గురువారం మే పుష్పాలు కనువిందు చేశాయి. ఇవి అరుదుగా కనిపిస్తాయని స్థానికులు చెబుతున్నారు. కుంకుమ పువ్వు రంగుతో మెరిసిపోతున్న ఈ పూవులను చూసేందుకు పరిసర ప్రాంతాల వారు ఆసక్తి చూపిస్తున్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం


లబ్ధిదారులతో మాట్లాడుతున్న జీఎం వెంకటరమణ

రామభద్రపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ ఫైనాన్స్ జనరల్ మేనేజర్ పి.వెంకటరమణ అధికారులను ఆదేశించారు. ఆరికతోటలో అసంపూర్తిగా నిలిచిన జగనన్న కాలనీని ఆయన గురువారం సందర్శించి, లబ్ధిదారులతో మాట్లాడారు. జూన్ 12న రాష్ట్ర వ్యాప్తంగా గృహ ప్రవేశాలు చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఈలోగా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రభుత్వం అదనంగా రూ.50 వేలు మంజూరు చేస్తుందన్నారు. డ్వాక్రా సంఘాల నుంచి రూ.25 వేల నుంచి రూ.35 వేల వరకు అందించనున్నట్టు తెలిపారు. అలసత్వం ప్రదర్శిసే రద్దు చేయడమే కాకుండా రికవరీలు కూడా చేస్తామని హెచ్చరించారు. హౌసింగ్ బొబ్బిలి డివిజన్ డీఈ అప్పయ్య, ఏఈ మత్స వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

పాలకొండ, మే 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆంజనేయకాలనీలో వెలసిన దక్షిణాముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి సిందూర, తమలార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

స్వామివారిని తమలపాకులతో అలంకరించిన దృశ్యం



గట్టు విస్తరిస్తే మేలు

- రాజాం-డోలపేట మధ్య తగ్గనున్న రద్దీ
- తక్కువ ఖర్చు.. ఎక్కువ ప్రయోజనం
- విద్యార్థులు, రోగులకు ప్రయోజనం

రాజాం రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): రాజాం మున్సిపాలిటీ పరిధిలోని రాజాం-డోలపేట మధ్య కిలోమీటరు పొడవు ఉన్న మల్లమ్మ చెరువు, గుర్రమ్మ చెరువు గట్లను విస్తరిస్తే ఈ రెండు ప్రాంతాల మధ్య రాకపోకలకు మార్గం సుగమం కానుంది. ఇదే సమయంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్‌పెట్టే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. డోలపేట, జి.ఎం.ఆర్.నగర్ ప్రాంతాలలోని ఎల్‌కేజీ నుంచి పీజీ వరకూ ఉన్న విద్యా సంస్థలతో పాటు కేర్ ఆసుపత్రికి రాకపోకలు సాగించే వందలాది మందికి ఎంతో మేలు కలగనుంది. దీంతో పాటు రేగిడి, వంగర, సంతకవిటి, పాలకొండ ప్రాంతాల నుంచి రాజాం వచ్చే ద్విచక్ర వాహన చోదకులు ఈ మార్గం ద్వారా సులభంగా రాజాం చేరుకునే అవకాశం కలగనుంది. రెండు దశాబ్దాల కిందట వరకూ చెరువు గట్లు మీదుగా రాజాం-డోలపేట మధ్య రాకపోకలు సాగేవి. అయితే నీటి పారుదల శాఖ అనుమతితో గుర్రమ్మ చెరువులో కొంత భాగాన్ని కప్పి ఆర్టీసీ కాంప్లెక్స్ రైతుబజార్, షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం చేపట్టడంతో ఈ రెండు చెరువులకు సంబంధించిన కిలోమీటరు పొడవునా గట్టు ఆక్రమణదారుల గుప్పెట్లోకి చేరింది. ఫలితంగా చెరువు గట్టు మీదుగా రాకపోకలకు బ్రేక్ పడింది. ఈ నేపథ్యంలో కిలోమీటరు పొడవునా చెరువు గట్టును అభివృద్ధి చేస్తే వందలాది మంది ట్రాఫిక్ జాంలో చిక్కుకోకుండా రాకపోకలు సాగిందేందుకు వెసులుబాటు కలగనుంది.

గతంలో ఇదే ప్రధాన మార్గం

రెండు దశాబ్దాల కిందట వరకూ డోలపేట పరిసర గ్రామాలకు చెందిన వారికి చెరువు గట్టే ప్రధాన మార్గంగా ఉండేది. సైకిళ్లు, ద్విచక్ర వాహనదారులతో పాటు పాదచారులు సైతం ఈ మార్గంలోనే వచ్చిపోయేవారు. ఈ రెండు చెరువుల్లో ఒకటి రాజాం మేజర్ పంచాయతీ పరిధిలోనిది కాగా, మరొకటి సారధి మేజర్ పంచాయతీ పరిధిలో ఉండేవి. ఇలాంటి పరిస్థితుల్లో చెరువును కప్పివేసి బస్టాండ్‌తో పాటు రెండు మేజర్ పంచాయతీలు షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం చేపట్టారు. కాలక్రమంలో బస్టాండ్ ప్రాంతం మినహా చెరువు గట్లలో కొంతభాగం కాలువ నిర్మాణం చేపట్టారు. మరికొంత భాగం ఆక్రమణలకు గురైంది.



అభివృద్ధి చేయాల్సిన చెరువు గట్టు ఇదే..



రాజాం-డోలపేట మధ్య నిలిచిపోయిన ట్రాఫిక్ (ఫైల్)

చిన్నపాటి ఆక్రమణలు తొలగించి సుమారు 20 అడుగులు వెడల్పు ఉన్న చెరువుగట్టును అభివృద్ధి చేస్తే వందలాది మందికి మేలు కలగనుంది.

ఎమ్మెల్యేపైనే ఆశలు..

ఈ ప్రాంతీయులంతా రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌పైనే గంపెడాశలు పెట్టుకున్నారు. గతంలో ఆయన హయాంలో రాజాం నియోజకవర్గంలో సుమారు రూ.500 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. ఇప్పుడు రాజాం-డోలపేట రహదారి పనుల కోసం రూ.9 కోట్లు మంజూరు చేయించారు. కాంట్రాక్టర్‌కు గత ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.6 కోట్ల బకాయిలు చెల్లించే ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో చెరువు గట్టు అభివృద్ధిపై ఆయన దృష్టి పెట్టాలని స్థానికులు కోరారు.

జేఎన్‌టీయూలో యోగా శిక్షణ

విజయనగరం రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్‌టీయూ (గురజాడ), వాటి అనుబంధ కళాశాలల్లో ఈ నెల 21 నుంచి వచ్చే నెల 21 యోగా కార్యక్రమాలను నిర్వహించనున్నామని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి తెలిపారు. వర్సిటీలో నిర్వహిస్తున్న యోగా శిక్షణ తరగతులను గురువారం ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్.రాజేశ్వరరావు, డైరెక్టర్లు ఆర్.గురునాథ్, పరీక్షల నియంత్రణ అధికారి జి.అప్పలనాయుడు, క్రీడల సమన్వయకర్త డాక్టర్ ఎ.వి.పాపారావు, యోగా బోధకుడు రవివర్మ తదతరులు ఉన్నారు

●జామి: మండలంలోని విజినిగిరి యోగాశ్రమంలో మూడు రోజులుగా యోగా శిక్షణ తరగతులు సందడిగా జరుగుతున్నాయి. గురువారం ఎంపీడీవో నాయుడు ఆధ్వర్యంలో యోగా తరగతులు నిర్వహించారు. సర్పంచ్ సూర్యారావు, గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పాఠశాలలకు స్టూడెంట్ కిట్స్

జామి, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాలలకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ స్టూడెంట్ కిట్ల పంపిణీని గురువారం ఎంఈవో-2 గంగరాజు ప్రారంభించారు. స్థానిక ఎంఆర్‌సీ నుంచి ప్రత్యేక వాహనాల ద్వారా ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేస్తున్నామని తెలిపారు.

నేడు రామనారాయణంలో 'యోగాంధ్ర'

విజయనగరం రింగురోడ్డు, మే 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణంలో శుక్రవారం ఉదయం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పర్యాటక ప్రాంతాల్లో యోగాంధ్రను నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో జిల్లాలో నాలుగు పర్యాటక ప్రాంతాలను ఎంపిక చేసింది. ఇందులో భాగంగానే రామనారాయణంలో జిల్లా యంత్రాంగం సుమారు 1500 మందితో యోగాసనాలు ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్నారు.

విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

గంట్యాడ, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొటారుబిల్లిలో గల కనకదర్గమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో 31న ఉదయం 8 గంటలకు అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. అదేరోజు మధ్యాహ్నం అన్న సమారాధన చేయనున్నామని ఆలయ కమిటీ పేర్కొంది.

విగ్రహ ప్రతిష్ఠోత్సవానికి ఆహ్వానం

శృంగవరపుకోట, మే 29 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పుణ్యగిరి కొండ వద్ద నిర్మించిన పద్మావతి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో 6న విగ్రహ ప్రతిష్ఠోత్సవానికి హజరుకావాలని చినజీయర్‌స్వామిని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఆహ్వానించారు. గురువారం విశాఖలోని త్రిదండి చినజీయర్‌స్వామి ఆశ్రమంలో చినజీయర్‌స్వామిని ఎమ్మెల్సీ కలిశారు.



చినజీయర్ స్వామిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ

గ్రంథాలయాలతో బాలల వికాసం

విజయనగరం బాబామెట్ట, మే 29 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు బాలల వికాసానికి తోడ్పతాయని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి అన్నారు. ఏపీ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాల్యం నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఏపీ గ్రంథాలయ సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ మాట్లాడుతూ ప్రతీ పంచాయతీలో గ్రంథాలయం విద్యార్థులకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో మేకా అనంతలక్ష్మి, జిల్లా శాఖ కార్యదర్శి సుభద్రాదేవి, మహిళా విభాగం అధ్యక్షురాలు పిన్నింటి కళావతి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో గ్రంథాలయ కార్యదర్శి లక్ష్మి

ఘనంగా అహల్యాబాయి హోల్కర్ జయంతి

విజయనగరం దాసన్నపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రోటరీ క్లబ్‌లో గురువారం పుణ్యశ్లోక రాణి అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతిని ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేశ్వర్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాణి అహల్యాబాయి భారత్‌లో ఎన్నో దేవాలయాల నిర్మాణం చేయించారన్నారు. ప్రజాసేవలో ఆమె తరించారన్నారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డి పావని, లక్ష్మీనరసింహం, కుసుమంచి సుబ్బారావు, నారాయణరావు, నాగమల్లిక తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్

బ్యాడ్మింటన్ క్రీడాకారిణికి రాకెట్లు

శృంగవరపుకోట, మే 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిబిరంలో శిక్షణ పొందుతున్న రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారిణి భరణికాన హరికకు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దేవికారాణి రూ.5వేలు విలువ చేసే యోనెక్స్ రాకెట్లు అందజేశారు. దేవికారాణి కూడా ఇక్కడ గతంలో బ్యాడ్మింటన్‌లో శిక్షణ పొందారు. గురువారం తండ్రి కిరణ్‌తో కలిసి వేసవి క్రీడా శిబిరానికి వచ్చి క్రీడా విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. జూనియర్స్, సబ్‌జూనియర్స్‌గా విభజించి చీఫ్ కోచ్ పొట్నూరు శ్రీరాములు పోటీలు నిర్వహించారు.

ఈవీఎం గోదాంల పరిశీలన

నెల్లిమర్ల, మే 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఈవీఎం గోదాములను కలెక్టర్ అంబేడ్కర్ గురువారం తనిఖీ చేశారు. గోదాములకు వేసిన సీళ్లను పరిశీలించారు. సెక్యూరిటీ ఏర్పాట్లపై ఆరా తీశారు. అప్రమత్తంగా ఉండాలని అధికారులు, పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఆయనతో పాటు ఇన్‌చార్జి ఆర్డీవో టి.సవరమ్మ, ఇన్‌చార్జి తహసీల్దారు రవిశంకర్, కలెక్టరేట్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ శేఖర్ ఉన్నారు.



గోదాం వద్ద రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

మారుమూల పల్లెలకు రహదారి సౌకర్యం

గుర్ల, మే 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మారుమూల పల్లెలకు సైతం తారు రోడ్డు సౌకర్యం కల్పించాలన్నదే కేంద్ర ప్రభుత్వం ధ్యేయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేశ్వర్మ అన్నారు. గురువారం పల్లిగండ్రేడు పంచాయతీ రాజులపేటకు రూ.55 లక్షల ఉపాధి హామీ నిధులతో మంజూరైన బీటీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల తరబడి రోడ్డు కోసం ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. ఎట్టకేలకు బీటీ రోడ్డు ఏర్పాటు కానుందన్నారు. కార్యక్రమంలో జంపాన సూర్యనారాయణరాజు, మజ్జి రామారావు, సర్పంచ్ పెనుమల శంకరయ్య, మజ్జి ఆదినారాయణ పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

ప్రజలకు అండగా బీఎస్పీ

విజయనగరం దాసన్నపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) ప్రజలకు అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ అన్నారు. గురువారం నగరంలోని కంటోన్మెంట్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి సోము రాంబాబు అధ్యక్షతన బహుజన సంకల్పసభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. బహుజన సమాజ్ పార్టీని ఏ శక్తి కూడా విచ్ఛిన్నం చేయలేదన్నారు. యూపీలో రి మాయావతి అధికారంలోకి రాగానే 16 లక్షల ఎకరాల ప్రభుత్వ భూమిని బహుజనులకు పంపిణీ చేశారని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జె.మల్లికల్ మాట్లాడుతూ రాజ్యాంగ హక్కులను బహుజనులకు సమానంగా అందనీయకుండా చేస్తున్న మనువాద పార్టీలను గద్దె దించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బోని కృష్ణ, సోములు, శివప్రసాద్, గౌరిరీ, పైడిరాజు, చైతన్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌కుమార్

రైలు ఢీకొని వ్యక్తి మృతి

దత్తిరాజేరు, మే 29 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందినట్టు రైల్వే కానిస్టేబుల్ బి.ఈశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని మానాపురం రైల్వేగేటు సమీపంలో గురువారం హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీ కొనడంతో ఒడిశా రాష్ట్రం కలహండి జిల్లా జమున బహల్ తాలూకా దాదాపూర్ గ్రామానికి చెందిన సునీల్ బిస్వాల్ (46) మృతి చెందినట్టు తెలిపారు. మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో రూ.6.90 లక్షల జరిమానా

విజయనగరం క్రైం, మే 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో నమోదైన 69 డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున రూ.6.90 లక్షల జరిమానా విధిస్తూ అడిషనల్ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ న్యాయాధికారి ఎంఎస్‌హెచ్‌ఆర్ తేజాచక్రవర్తి గురువారం తీర్పు వెల్లడించారని ఎస్పీ వకుల్ జిందాల్ ఓ ప్రకటన తెలిపారు. ట్రాఫిక్ సీఐ సూరినాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి 69 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారని ఎస్పీ పేర్కొన్నారు.

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్టు

నెల్లిమర్ల, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొర్లెపేటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గురువారం దాడి చేశామని నెలల్లిమర్ల ఎస్ఐ బి.గణేష్ తెలిపారు. ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.15 వేలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

జిందాల్ నిర్వాసితుల సమావేశం వాయిదా

శృంగవరపుకోట, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పెద్దల నుంచి సానూకూల సమాచారం అందడంతో గురువారం జరగాల్సిన జిందాల్ భూ నిర్వాసితుల సమావేశాన్ని వాయిదా వేసినట్టు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిర్వాసితుల భూ సమస్యను ప్రభుత్వం పరిష్కరిస్తుందని ఆశిస్తున్నామన్నారు. 17 సంవత్సరాల క్రితం ఉద్యోగాలు వస్తాయని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని చిన్న, సన్నకారు గిరిజన రైతులు జిందాల్ పరిశ్రమకు భూములు ఇచ్చారన్నారు. పరిశ్రమ నిర్మాణం లేకపోవడంతో ఉద్యోగాలు రాక, ఎటూ వెళ్లలేక యువత సందిగ్ధంలో ఉందన్నారు. షేర్ హోల్డర్‌లుగా ఉన్న రైతులకు పెరిగిన ధరలకు అనుగుణంగా చెల్లింపులు చేయాలన్నారు. ఎంఎస్ఎంఈ పార్కు, ప్రభుత్వానికి తాము వ్యతిరేకం కాదన్నారు. ఇక్కడ యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని అప్పట్లో భూములు ఇప్పించామన్నారు. ప్రభుత్వం ఇందుకు సానుకూలంగా స్పందిస్తుందని భావిస్తున్నామని ఎమ్మెల్సీ అన్నారు.

యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

శృంగవరపుకోట, మే 29 (ఆంధ్రజ్యోతి) : శృంగవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిరుద్యోగ యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణను ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ కేశవరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో శిక్షణకు 18 నుంచి 30 ఏళ్ల లోపు యువత అర్హులన్నారు. టెన్త్ నుంచి డిగ్రీ పూర్తి చేసినవారు జూన్ 4లోపు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు 7995691295ను సంప్రదించాలన్నారు.

మత మార్పిడిలను అరికట్టండి

లక్కవరపుకోట, మే 29 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జరుగుతున్న మత మార్పిడిలను అరికట్టాలని హిందూ ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని సమరసత సేవాఫౌండేషన్ జోనల్ అధికారి ఎ.గంగాధర్ అన్నారు. గురువారం ఎల్.కోటలో జిల్లాస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలవంతపు మత మార్పిడిలు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేవాలయాల పరిరక్షణ, విగ్రహారాధన పెరగాలన్నారు. ఈ సందర్భంగా హిందూ ధర్మ పరిరక్షణ కోసం పలువురు మాట్లాడారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు స్థలపరిశీలన

నెల్లిమర్ల, మే 29 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల ప్రజల దాహార్తిని తీర్చేందుకు వీలుగా చంపావతిలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేస్తున్నామని కమిషనర్ ఎ.తారక్‌నాథ్ తెలిపారు. గురువారం నగర పంచాయతీ అధికారులతో పాటు విజయనగరం నగరపాలక సంస్థ పబ్లిక్ హెల్త్, ఇరిగేషన్ అధికారులు చంపావతి పరీవాహక ప్రాంతాన్ని పరిశీలించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఏర్పాటు ప్రాధ్యానంపై ఇటీవల నిర్వహించిన జిల్లా అభివృద్ధి మండలి సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనితకు ఎమ్మెల్యే లోకం నాగమాధవి వివరించారు. అందుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. దాంతో నగర పంచాయతీ కమిషనర్ ఎ.తారక్‌నాథ్, పబ్లిక్ హెల్త్ ఈఈ ఎస్.జ్యోతి, డీఈఈ బి.ఈశ్వర్, ఏఈ మణికంఠ, ఇరి గేషన్ డీఈఈ గోవిందరావు తదితరులు చంపావతి తీరాన్ని పరిశీలించారు.



స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

ఇళ్ల స్థలాలు మంజూరు చేయండి

గజపతినగరం, మే29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు నిరుపేదలకు ఇళ్లు, ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పురం అప్పారావు డిమాండ్ చేశారు. ఇళ్లు, ఇళ్ల పట్టాల మంజూరు కోసం జూన్ 2న తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టనున్న నిరసనకు సంబంధించిన వాల్ పోస్టర్లను గురువారం స్థానిక వినాయక ఆలయం ఎదుట ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గేదెల రామునాయుడు, శ్రీను, అప్పలరాము తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గెడ్డలో మొక్కల తొలగింపు

లక్కవరపుకోట, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాంపురం రెవెన్యూ పరిధిలోని కోటవాని చెరువు గెడ్డలో ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు స్పందించారు. 'గెడ్డపై గెద్దలు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా స్థాయి అధికారులు స్పందించారు. ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని నిర్ధారణకు వచ్చారు. తహసీల్దారు ఆదేశాల మేరకు గురువారం కల్లేపల్లి, శ్రీరాంపురం వీఆర్వోలతో పాటుగా ఆర్ఐ సన్యాసిరావు ఆధ్వర్యంలో ఆక్రమిత భూమిలో వేసిన సరుగుడు మొక్కలను తొలగించారు. ప్రభుత్వ భూమిని ఎవరు ఆక్రమించినా చర్యలు తప్పవని ఆర్ఐ హెచ్చరించారు. ఆక్రమణ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.



మొక్కలు తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

గోస్తనీ తీరంలో ట్రెంచ్‌లు

శృంగవరపుకోట రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చామలపల్లి సమీపం గోస్తనీ తీరంలో జామి మండలం తానవరం, దిగువ గ్రామాలకు నీరు వెళ్లే సాగుకాలువ వద్ద గురువారం ట్రెంచ్ తవ్వకాలు చేపట్టారు. గోస్తనీ తీరంలో ఇసుక అక్రమ తవ్వకాల నేపథ్యంలో సాగునీటి కాలువను పూడ్చేసిన విషయాన్ని స్థానిక రైతులు తహసీల్దారు అరుణకుమారికి ఇటీవల ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆమె.. ఆర్ఐ మనోజ్‌కుమార్, వీఆర్వో గణేశ్‌లను విచారణకు పంపారు. అక్కడ విషయాన్ని గుర్తించిన ఆర్ఐ.. ట్రెంచ్ తవ్వకం అవసరాన్ని గుర్తించారు. దాంతో గురువారం అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేశారు.



ట్రెంచ్‌లు తవ్విస్తున్న అధికారులు

కుళాయి అక్రమ కనెక్షన్లపై కమిషనర్ సీరియస్

- మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం

నెల్లిమర్ల, మే 29 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీలో కుళాయి అక్రమ కనెక్షన్ల వ్యవహారంపై నగర పంచాయతీ కమిషనర్ ఎ.తారక్‌నాథ్ సీరియస్ అయ్యారు. ఈ వ్యవహారంపై తాడో పేడో తేల్చాలని నిర్ణయించారు. డిపాజిట్ సొమ్ము చెల్లించకుండా ఏళ్ల తరబడి 267 కుళాయి కనెక్షన్లు వినియోగించడాన్ని తీవ్రంగా పరిగణించారు. 'నెల్లిమర్లలో కలకలం' శీర్షికతో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. నగర పంచాయతీలోని వార్డు ఎమినిటీస్ కార్యదర్శులతో తన చాంబర్‌లో గురువారం సాయంత్రం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మూడు రోజుల్లో అక్రమ కనెక్షన్ల నివేదికలను అందజేయాలని ఆదేశించారు. ఇప్పటికే 267 అక్రమ కనెక్షన్లు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించినా విచారణ చేపడితే ఆ సంఖ్య 400కు చేరే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రతి వార్డులో కనక్షన్లు ఎన్ని? ఇంటి యజమానులు ఎవరు? గతంలో డిపాజిట్ సొమ్ము చెల్లించారా? చెల్లిస్తే ఎవరికి ముట్టజెప్పారు? అనే విషయాలపై ఆరా తీయాలని కార్యదర్శులను ఆదేశించారు. సదరు ఇంటి యజమానుల నుంచి లిఖిత పూర్వకంగా వివరాలను రాబెట్టాలని కూడా కార్యదర్శులకు సూచించారు. డిపాజిట్ సొమ్ము పక్కదారి పట్టినా, చేతులు మారినా సంబంధిత ఉద్యోగులపై చర్యలకు సైతం వెనుకాడకూడదనే ఆలోచనతో ఉన్నారు. ఒక వైపు లక్షలాది రూపాయిలు డిపాజిట్ సొమ్ముతో పాటు సంవత్సరాల తరబడి నగర పంచాయతీ పన్నుల రూపంలో నష్టపోయిన అంశాన్ని కూడా కమిషనర్ తీవ్రంగా పరిగణిస్తున్నారు. రెండు రోజుల్లో అక్రమ కనెక్షన్లను బంద్ చేయాలని సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు.

చెరువులో వ్యర్థాల తొలగింపు

భోగాపురం, మే29(ఆంధ్రజ్యోతి): భోగాపురంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గంగిరావి చెరువులో వ్యర్థాలను ఎట్టకేలకు గురువారం పంచాయతీ పాలకులు తొలగించే ఏర్పాటు చేశారు. గంగిరావి చెరువువ్యర్థాలతో నిండటంతో 'గుండె చెరువు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. దాంతో చెరువులో వ్యర్థాల తొలగింపునకు చర్యలు చేపట్టారు.

చెరువులో వ్యర్థాలు తొలగిస్తున్న కార్మికులు



కోర్టు భవన నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న న్యాయాధికారిణి హేమశ్రవంతి

బొబ్బిలి రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలో నూతన కోర్టు భవన నిర్మాణ పనులకు బొబ్బిలి ప్రధాన జూనియర్ సివిల్ న్యాయాధికారి బి జె.హేమశ్రవంతి గురువారం శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించి, త్వరితగతిన పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఆనందకుమార్, ఉపాధ్యక్షుడు ఆర్‌వీఎస్ఎస్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి బీఎస్ఆర్ మూర్తి, మాజీ అధ్యక్షుడు పి.మోహన్ మురళీకుమార్, గంటి గోపాలకృష్ణ శర్మ, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని అరికట్టడంలో కేంద్రం విఫలం

బొబ్బిలి రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదాన్ని అరికట్టడంలో కేంద్రం విఫలం అయ్యిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.శంకర్రావు ఆరోపించారు. బొబ్బిలిలోని తాపీ పనివారి సంఘ భవనంలో గురువారం నిర్వహించిన సీపీఎం సదస్సులో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఉగ్రవాదుల్ని భూమి అంచుల్లో ఉన్నా పట్టుకుంటామని ప్రగల్భాలు పలికిన ప్రధానమంత్రి ఇంతవరకు ఆ నలుగురు ఉగ్రవాదుల్ని ఎందుకు పట్టుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.వర్మ, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు ఎం.గోపాలం, పీకేఎస్ నాయకుడు టి.అప్పలనాయుడు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.అప్పన్న, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాల్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు లక్ష్మణరావు పాల్గొన్నారు.

రోడ్డుపై నీరు నిలిచిపోకుండా చూడాలి



కాలువను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపం రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్ ఏరియాలలో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి గురువారం పర్యటించారు. కాలువల్లో పూడికలు తొలగించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళికి సూచించారు. రహదారిపై నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

నీటి తీరువా వసూళ్లు వేగవంతం చేయాలి

బాడంగి, మే 29(ఆంధ్రజ్యోతి): నీటి తీరువా వసూళ్లు వేగవంతం చేయాలని తహసీల్దార్ సుధాకర్ సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మండలంలోని గ్రామ రెవెన్యూ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి తీరువా వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ వర్తించేందుకు కౌలురైతులకు కార్డులు అందజేయాలని సూచించారు. అలాగే రీసర్వే వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ధనం, మండల సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చిన పోలీసులు



ఆర్టీసీ కూడలి వద్ద గోతులు పూడ్చుతున్న పోలీసులు

బొబ్బిలి రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలిలో ఏర్పడిన గోతులను బొబ్బిలి ట్రాఫిక్ ఎస్ఐ జ్ఞానప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గురువారం పూడ్చారు. ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ నుంచి దాడితల్లి ఆలయం వరకు ఉన్న బైపాస్ రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. వర్షాకాలంలో ఈ గుంతల్లో నీరు నిలిచి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఒకేసారి మూడు ఉద్యోగాలు

● సత్తా చాటిన గాయత్రి



కుటుంబ సభ్యులతో గాయత్రి

బొబ్బిలి రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపాలిటీ పరిధి ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న బొత్స గాయత్రి అనే యువతి ఒకేసారి మూడు బ్యాంకు ఉద్యోగాలు సాధించింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల విడుదలైన బ్యాంకు ఫలితాల్లో ఐడీబీఐ బ్యాంకు ఎగ్జిక్యూటివ్, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో పీవో, కెనరా బ్యాంక్ క్లర్క్ ఉద్యోగాలు పొందానని తెలిపింది. దీంతో ఆమె తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పీవోగా చేరుతానని ఆమె తెలిపింది.

సబ్‌జైలు సందర్శన



సబ్‌జైలును పరిశీలిస్తున్న న్యాయాధికారి కృష్ణప్రసాద్

బొబ్బిలి రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి సబ్‌జైలును జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కం సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.కృష్ణప్రసాద్ గురువారం సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. వంటశాల, జైలు పరిసరాలను పరిశీలించారు. జైలులోని ఖైదీలకు అందిస్తున్న భోజనం, వసతి, సౌకర్యాలపై పర్యవేక్షణాధికారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిమాండ్ ఖైదీలకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించి, చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయవాదులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 316మంది ఎంపిక

బొబ్బిలి రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని ఓ డిగ్రీ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన మెగా జాబ్ మేళాలో 316 మంది ఎంపికైనట్టు స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. మొత్తం 598 మంది హాజరు కాగా, 19 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 316మందిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అప్పలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు కార్డులున్న వారికి సుఖీభవ

● వ్యవసాయ శాఖ జేడీ రామారావు



గంట్యాడ: కౌలు కార్డులు పంపిణీ చేస్తున్న జేడీ రామారావు

గంట్యాడ, మే 29(ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతులు కౌలు గుర్తింపు కార్డులు తీసుకుంటే రుణాలతో పాటు అన్నదాత సుఖీభవ పథకం పొందవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వీటీ రామారావు అన్నారు. మండలంలోని రామవరం గ్రామంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులను గురువారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హతున్న రైతులు కౌలు గుర్తింపు కార్డులు తీసుకోవాలని, తద్వారా ప్రభుత్వ పథకాలు పొందవచ్చన్నారు. విత్తనాలు, ఎరువులతోపాటు రుణాలు తీసుకోవచ్చని తెలిపారు. కౌలు గుర్తింపు కార్డులతో చాలా ఉపయోగాలు ఉన్నాయని, వీటిని వినియోగించుకోవాలన్నారు. రానున్న రోజుల్లో రైతులకు ఎరువులు, విత్తనాలు పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి శ్యామ్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఆధార్ లింక్ తప్పనిసరి

బొబ్బిలి రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ లబ్ధి పొందడానికి రైతులు విధిగా వారి భూములను ఆధార్ కార్డుతో లింకు చేసుకోవాలని బొబ్బిలి ఏడీఏ మజ్జి శ్యామ్‌సుందర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన జగన్నాథపురంలో రైతులకు అవగాహన కల్పించారు. అన్నదాత సుఖీభవ పథకానికి కౌలురైతులు అర్హత పొందాలంటే తప్పనిస రిగా గుర్తింపు కార్డు ఉండాలన్నారు. వచ్చే నెల 15లోగా కౌలుదారు కార్డుల ను జారీ చేయాలని ఆయన వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందికి ఆదేశించారు. గ్రామ వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

దోపిడీ దొంగల అరెస్టు

(ఐదో పేజీ తరువాయి)

జిల్లా ఎండభద్రకు చెందిన జగంకు సమాచారం ఇచ్చాడు. సురేష్ ఇంటి ఫొటోలు, వీడియోలు పంపించాడు. సురేష్ ఇంట్లో బంగారం, నగదు ఎక్కడ ఉన్నదీ ఆయనకు వివరించాడు. ఆపై జగం ఈ సమాచారాన్ని విజయనగరంలో ఉన్న సావిత్రి (అలియాస్ జ్యోతి)కి తెలిపాడు. ఆమె ఇదే విషయాన్ని సంగారెడ్డి గూడెంలో ఉన్న ఆచంట వెంకటేశ్‌కు, విజయనగరంలో ఉన్న నాగరాజుకు చేరవేసింది. వీరంతా గతంలో రియల్ ఎస్టేట్ తదితర వ్యాపారాలు చేశారు. సులభంగా డబ్బులు సంపాదించాలన్న ఆశ వీరందరినీ ఏకం చేసింది. ఈ నేపథ్యంలోనే నాగరాజు కూడా తనకు పరిచయం ఉన్న బాపట్లకు చెందిన నాజులబాబు, కిషోర్ అనే వ్యక్తులకు చెప్పాడు. తమకు అందిన ఈ సమాచారాన్ని నాజులబాబు, తనకు అత్యంత సన్నితుడైన శ్యాంకుమార్, కైకలూరుకు చెందిన వంగర శ్రీనివాసరావుకు చెప్పాడు. వీరంతా ఒక గ్రూపుగా ఏర్పడి దొంగతనానికి సంబంధించి పలు మార్లు మాట్లాడుకు న్నారు. తమ వద్దనున్న పక్కా సమాచారం ఆధారంగా చీపురుపల్లిలో దొంగతనానికి పథకం వేశారు. ఈనెల 23న వీరంతా రాజమండ్రిలో కలిసి చర్చించుకు న్నారు. అదే రోజున ఉదయం విజయనగరం చేరుకొని, అక్కడి ఓ రెస్టారెంట్‌లో మరోసారి సమావేశమయ్యారు. 23న సాయంత్రం కారులో చీపురుపల్లి చేరుకొని సురేష్ ఇంటి వద్ద రెక్కీ నిర్వహించారు. తమకు అందిన సమాచారం నిజమేనా కాదా అని నిర్ధారించుకొని రాత్రి ఒంటి గంట ప్రాంతంలో నాజుల్‌బాబు, శ్యాంకుమార్, శ్రీనివారావు, కిషోర్‌లు సురేష్ ఇంట్లోకి ప్రవేశించారు. అక్కడ నిద్రలో ఉన్న వారణాసి కస్తూరిబాయి, వైశ్యరాజు చిట్టెమ్మలను తీవ్రంగా గాయపరిచారు. వెనువెంటనే వారి మెడలో ఉన్న బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను దోచుకుని పరారయ్యారు. కేసులో మొత్తం పది మంది భాగస్వాములు కాగా ఇప్పటి వరకూ నాజుల్‌బాబు, జగం, శ్యాంకుమార్, వంగర శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, నాగరాజు, దాసు సావిత్రి, మన్నేల సూర్యారావు అనే ఎనిమిది మంది నిందితుల్ని ఈ నెల 28న విజయనగరంలో అరెస్టు చేసినట్టు డీయస్పీ ఎస్. రాఘవులు తెలిపారు. వీరి నుంచి 5.5 తులాల బంగారు ఆభరణాలు, సెల్ ఫోన్లు, ఒక కారు స్వాధీనం చేసుకున్నామన్నారు. కాగా 17.5 తులాలు చోరీకి గురయినట్టు బాధితులు ప్రాథమికంగా చెప్పారని, ఫిర్యాదుదారు సురేష్ వేరే ప్రాంతంలో ఉన్నందున, చోరీ సొత్తుపై స్పష్టత లేదని అన్నారు. కారు డ్రైవర్ మనోజ్, టి.కిషోర్ పరారయినట్టు ఆయన తెలిపారు. వారి కోసం గాలిస్తున్నామన్నారు. కాగా గతంలో ఈ ముఠా హైదరాబాద్, ఏలూరు, సంగారెడ్డి, ఖమ్మంలలో దోపిడీకి విఫలయత్నం చేసిందన్నారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన చీపురుపల్లి సీఐ జి.శంకరరావు, చీపురుపల్లి, గరివిడి, బుదరాయవలస ఎస్సైలు ఎల్.దామోదరరావు, లోకేష్, లోకేశ్, సిబ్బందిని, డీయస్పీ రాఘవులు అభినందించారు.

మంగళపాలెంలో భారీ చోరీ

(ఐదో పేజీ తరువాయి)

ఆరు గదులు ఉండగా కుటుంబ సభ్యులంతా నిద్రిస్తున్న గదులకు ముందుగా గడియా పెట్టి ఆపై చోరీకి పాల్పడ్డారు. జగదీష్‌బాబు తాత ముత్తాతల నుంచి వారసత్వంగా వచ్చిన రాజరాజేశ్వరి దేవి బంగారు విగ్రహంతో పాటు అమ్మవారికి సంబంధించిన ఆభరణాలు చోరీకి గురయ్యాయి. అమ్మవారి బంగారుపాదాలు, వడ్డాణం, దండ కడియాలు, 108 కాసుల హారం, కొబ్బరి పువ్వులు పోలిన బంగారు గొలుసుపాటు అమ్మవారికి సంబంధించి మరికొన్ని ఆభరణాలు చోరీ అయ్యాయి. అక్కడే ఉన్న పంచలోహాల విగ్రహం జోలికి దుండగులు పోలేదు. ఈ ఆభరణాలను దేవుని గదిలో ఉంచి జగదీష్‌బాబు నిత్యం పూజలు చేస్తుంటారు. ఇవి కాకుండా తన తల్లి, అక్కకు సంబంధించిన బంగారు ఆభరణాలు, సుమారు రూ.10 లక్షల నగదును కూడా పట్టుకుపోయారు. జగదీష్‌బాబు ఇంట్లో రాజరాజేశ్వరి అమ్మవారికి సంబంధించిన శక్తి పీఠం ఏర్పాటు చేసి ఉంది. ఈ పీఠాన్ని తండ్రితోపాటు, తాత, ముత్తాతలు కొలిచే వారు. ఇప్పటికీ ఈ శక్తి పీఠానికి జగదీష్‌బాబు పూజలు చేస్తుంటారు. దుండగులను పట్టుకునేందుకు కొత్తవలస, శృంగవరపుకోటలకు చెందిన సీఐలు షణ్ముఖరావు, వర్రి నారాయణమూర్తితో పాటు కొత్తవలస, వేపాడ, లక్కవరపుకోట, శృంగవరపుకోటలకు చెందిన ఎస్‌ఐలతో బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు మొదలు పెట్టారు. విజయనగరం నుంచి క్లూస్ టీంలు వచ్చి వేలిముద్రలను సేకరించారు. ఇదే ప్రాంతంలో గురుదేవ చారిటబుల్‌ట్రస్టుకు సంబంధించిన కార్యాలయంతో పాటు కృత్రిమ అవయవాలు తయారు చేసే పరిశ్రమ, గురుదేవ ఆసుపత్రి, క్యాన్సర్ ఆసుపత్రి ఉన్నాయి. వీటి సమీపంలోనే చోరీ జరగడంతో సీసీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. ఇంట్లో సీసీ కెమెరాలు లేవు. ట్రస్టుకు సంబంధించిన కార్యాలయం, ఆసుపత్రుల వద్దే సీసీ కెమెరాలు ఉండడంతో దుండగుల కదలికలు కనుగొనడం కష్టంగా మారింది.

రెండు మూడు రోజులు రెక్కీ జరిగింది

తమ ఇంట్లో జరిగిన చోరీ అప్పటికప్పుడు చేసింది కాదని బాధితుడు జగదీష్‌బాబు తెలిపారు. దుండగులు రెండు మూడు రోజుల పాటు రెక్కీ నిర్వహించి ఉంటారన్నారు. ట్రస్టుకు, ఆసుపత్రులకు ప్రతి రోజు వందలాది మంది వస్తుంటారని, వారిలాగే దుండగులు వచ్చి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు.

'మొక్క'బడి

(ఐదో పేజీ తరువాయి)

రోడ్డుకిరువైపులా మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇచ్చింది. 2019-20 నుంచి 2021-22 మధ్య జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ పథకాన్ని అమలుచేసింది. దాదాపు 2,200 కిలోమీటర్ల మేర.8,81,414 మొక్కలు నాటినట్టు స్పష్టం చేసింది. కేవలం వాటి సంరక్షణకే రూ.10 కోట్లు వెచ్చించారు. ఇంత ఖర్చు చేసినా ఎక్కడా మొక్కలు కనిపించడం లేదు. కనీసం వాటి ఆనవాళ్లు తెలియడం లేదు. వాస్తవానికి సరిగ్గా నిర్వహణ చేపడితే 85 శాతం మొక్కలు బతకాలి. ఒక వేళ మొక్కలు చనిపోతే వాటి స్థానంలో కొత్తగా నాటాలి. 2021-22 ఆర్థిక సంవత్సరంలో అటవీ శాఖ నర్సరీల నుంచి 1.06 లక్షల మొక్కలు తెచ్చారు. మిగిలిన వాటిని ప్రైవేటు నర్సరీల నుంచి సేకరించారు. మొక్కల కొనుగోలు, ట్రీగార్డులు, వాటి సంరక్షణకు ఏడాదిలో రూ.4.90 కోట్లు ఖర్చు చేసినట్టు లెక్కలు చూపారు. జిల్లాలో ఎక్కడా మొక్కలు పెరిగి చెట్లుగా మారిన దాఖలాలు లేవు.

కాసులే కాసులు

జగనన్న పచ్చతోరణం పథకం అప్పటి యంత్రాంగానికి కాసులు కురిపించింది. మొక్కల కొనుగోలు సమయంలో భారీ అవినీతి జరిగింది. ఈ బాగోతంలో కింది స్థాయి సిబ్బంది నుంచి జిల్లా అధికారుల వరకూ భాగస్వామ్యం అయ్యారు. వాస్తవానికి ఆరు అడుగుల ఎత్తు, రెండేళ్ల వయసున్న మొక్కలనే నాటాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. కానీ ఎక్కడా ఆ పొడవు ఉన్న మొక్కలను నాటలేదు. 3 నుంచి 4 అడుగుల పొడవు ఉన్న మొక్కలను కొనుగోలు చేసి నాటారు. కానీ ఆరు అడుగుల మొక్కను కొనుగోలు చేసినట్టు చూపారు. ఒక్కో మొక్క రూ.98కి కొనుగోలు చేసినట్టు చూపారు. రూ.20 చొప్పున కమీషన్ తీసుకున్నారు.

ఖర్చులిలా..

ఒక్కో మొక్క కోసం గొయ్యి తీసేందుకు రూ.52.90, రవాణాకు రూ.3, అంతర్గత రవాణాకు రూ.2.30, నాటేందుకు రూ.9.12, కంచె కట్టేందుకు రూ.140లు ఖర్చు చేసినట్టు చూపించారు. ఎరువు వేసేందుకు, నీళ్ల పోసేందుకు అదనపు ఖర్చులు చేశారు. అయితే రోడ్డు విస్తరణ చేపట్టిన చోట సైతం మొక్కలు నాటామని లెక్కల్లో చూపడం గమనార్హం. జిల్లాలో జాతీయ రహదారి 516 నిర్మాణం జరుగుతున్న సంగతి తెలిసిందే. గంట్యాడ మండలం కొర్లాం, కొండతామరాపల్లి, తాటిపూడి ప్రాంతాల్లో వేలాది మొక్కలు నాటినట్టు చూపారు. తర్వాత రోడ్డు విస్తరణ పనుల్లో అవన్నీ కొట్టుకుపోయాయని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొక్కల కొనుగోలు, సంరక్షణ పేరిట రూ.2 కోట్లు పక్కదారి పట్టాయని కూటమి ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం రూ.10 కోట్ల నిధులు గోల్‌మాల్ అయినట్టు తెలుస్తోంది. ఏడాది గడుస్తున్నా వాటిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై విస్మయం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

బాధ్యులపై చర్యలుంటాయి

జిల్లా వ్యాప్తంగా ఉపాధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గత ప్రభుత్వంలో పచ్చతోరణం పథకం కింద అవినీతి జరిగినట్టు ఫిర్యాదులు ఉన్నాయి. వీటిపైనా దృష్టిపెట్టాం. ఇప్పటికే విచారణ జరిగింది. బాధ్యులపై చర్యలు ఉంటాయి. ఉపాధి హామీ పథకం పనుల్లో పారదర్శకత కోసం కఠినంగా వ్యవహరిస్తున్నాం.

- శారదాదేవి, డ్వామా పీడీ, విజయనగరం

అర్హులందరికీ గుర్తింపు కార్డులు

నెల్లిమర్ల, మే 29 (ఆంధ్రజ్యోతి): అర్హులైన కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తామని చీపురుపల్లి ఏడీఏ ఎన్.కోటేశ్వరరావు అన్నారు. సీతారామునిపేటలో ఏవో ఎం.పూర్ణిమ అధ్యక్షతన గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది 340 మంది వరకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వెల్లడించారు. అన్ని వివరాలతో వ్యవసాయ సహాయకుడిని గానీ వీఆర్వోను సంప్రదించాలని సూచించారు. వీఆర్వో గోవింద్, వ్యవసాయ సహాయకుడు శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు. ● దత్తిరాజేరు: కౌలు రైతులను గుర్తించి కౌలు కార్డులను మంజూరు చేయాలని వ్యవసా యశాఖ ఏడీ మహారాజన్ కోరారు. గురువారం మండలంలోని టి.బూర్జవలస రైతు సేవాకేంద్రంలో గురువారం కౌలు రైతుల గుర్తింపునకు గ్రామసభ నిర్వహించారు. వ్యవసాయశాఖ ఏడీ మహారాజన్ హాజరై రైతులతో మాట్లాడారు. గుర్తింపు కార్డు కలిగే ప్రయోజనాలను వివరించారు.

ఇప్పుడు మనోడే!

(ఐదో పేజీ తరువాయి)

అధికారులను వేరే నియోజకవర్గాలకు పంపించి, అక్కడ పని చేసిన అధికారులను ఈ నియోజకవర్గాలకు మార్చడం ద్వారా మండలాలకు కొత్తగా అధికారులను నియమించినట్లువుతుందని కూటమి నాయకులు కార్యకర్తలు సూచిస్తున్నారు. వీరి మనోభావాలను ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులు తెలుసుకోవడం లేదు. అధికారులు వేస్తున్న ఎరకు ఆశపడుతున్నారు. ఎవరైతే మీకేందుకు? మీకు కావలసింది పని? అంటూ సుద్దులు చెబుతుండడంతో మండల, గ్రామ స్థాయి నాయకులు మింగలేక, కక్కలేక బిత్తర చూపులు చూస్తున్నారు. ఇదే అదనుగా అనుకూలమైన స్థానాల కోసం కొంత మంది తహసీల్దార్‌లు మాట నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు.

● జిల్లాలో పని చేస్తున్న పలువురు రెవెన్యూ అధికారులు విశాఖ, విజయనగరం పట్టణాల్లో నివసిస్తున్నారు. వీరంతా అక్కడి నుంచే మండలాల్లో రెవెన్యూ విధులు నిర్వహించేందుకు రోజూ రాకపోకలు సాగిస్తున్నారు. ఇలాంటి వారందరికీ కొత్తవలస, లక్కవరపుకోట, శృంగవరపుకోట, భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ, జామి, వేపాడ, నెల్లిమర్ల, గజపతినగరం, గంట్యాడ, చీపురుపల్లి మండలాలు అనువుగా ఉన్నాయి. అంతే కాకుండా రెవెన్యూపరంగా మంచి ఆదాయం వచ్చే మండలాలగాను పేరుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకోనేందుకు అనువుగా వున్న మండలాలు కావడంతో వీరంతా ఈ మండలాల్లో పనిచేసేందుకు మొగ్గుచూపుతున్నారు. గత వైసీపీ పాలనలో పనిచేసిన వారంతా తిరిగి ఈ మండలాల్లోనే పనిచేయాలని చూస్తున్నారు. ఇందుకోసం టీడీపీ, జనసేన కూటమి నాయకులను కలుస్తున్నారు. ఎమ్మెల్యేలతో మాట్లాడి పోస్టింగ్ ఇప్పించాలని ఆయా మండలాల నేతలను కోరుతున్నారు.

నదిని దోచేస్తున్నారు!

(ఐదో పేజీ తరువాయి)

కకావికళంగా దర్శనమిస్తోంది. భవిష్యత్‌లో ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందోనని నదీ తీర గ్రామాల ప్రజలు భయపడుతున్నారు. వచ్చేది వర్షాకాలం కావడంతో వరద నీరు చేరాక సమీప గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. అలాగే నదీ స్నానం కోసం కాని, ఈత సరదా కోసం కాని దిగే వారి పరిస్థితి ఏంటని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమార్కులు ఇసుకను అక్రమంగా తవ్వి రూ.లక్షల్లో ధనార్జన పొందుతున్నారు. ఇక్కడి నుంచి ట్రాక్టర్లతో తరలించి ఆపై లారీలకు నింపి విశాఖ, ఇతర ప్రాంతాల్లో ఇసుకను భారీ ధరకు విక్రయిస్తున్నారు. పట్టపగలే యంత్రాలతో భారీగా తవ్వకాలు జరుపుతున్నారంటే అధికారుల తీరు ఏవిధంగా ఉందో తెలుస్తోంది. దీనిపై తహసీల్దార్ ఎం.సురేష్‌ను వివరణ కోరగా ఆర్ఐ, వీఆర్వోను పంపించి పరిశీలించి చర్యలు తీసుకొంటామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొబ్బిలి రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపాలిటీలోని 33/11 కేవీ గ్రోత్ సెంటర్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ఆవాల అనంతరావు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్లాస్టిక్‌ను వినియోగించొద్దు

బొబ్బిలి రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ పర్యావరణానికి హానికరమని ఎంపీవో సుధాకర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన దిబ్బగుడ్డివలస గ్రామంలో పర్యటించి, ప్లాస్టిక్ అనర్థాలపై ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి పార్వతి, మహిళా పోలీసు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

పాలకొండ, మే 29 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ కాలనీలో మౌలిక సదుపా యాలు కల్పించాలని ఆ కాలనీవాసులు నగర పంచాయతీ కమిషనర్ రత్నరాజును కోరారు. ఈ మేరకు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బుడితి అప్పలనాయుడు ఆధ్వర్యంలో గురువారం ఆయనకు వినతిపత్రం అందించారు. కాలనీలో వీధిలైట్లు లేక ఇబ్బందులు పడుతున్నామని, రాత్రి సమ యాల్లో విషసర్పాలు సంచరించడంతో భయభ్రాంతులకు గురవుతున్నామని తెలిపారు.